క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా సోమవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింద ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 నుంచి 8 గంటల వరకు... మలక్‌పేట, గంజ్ లోపల, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, ఆయిల్ మిల్, గంజ్ ఎస్ఎస్, ఔట్‌సైడ్ గంజ్ పరిసర ప్రాంతాలు.
- ఉదయం 8 నుంచి 10 గంటల వరకు.. పోచమ్మ టెంపుల్, హెచ్‌బీ కాలనీ, ఎంసీ కాలనీ వాటర్‌వర్క్స్ పరిసర ప్రాంతాలు.

రైతు బజారు ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 30, వంకాయ 33, బెండ 45, పచ్చి మిర్చి 65, కాకర 38, బీర 35, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 125, క్యారెట్ 50, దొండ 25-28, చిక్కుడు 85, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 20, దోస 15, సొర 11, పొట్ల 18, ఉల్లి 16, చామగడ్డ 35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు 5కే 'తెలంగాణ రన్'

చైతన్యపురి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పీ అండ్ టీ కాలనీ చౌరస్తా నుంచి ఎల్బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు సోమవారం 5కే తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు నిర్వహించే 5కే రన్‌లో ముఖ్యఅతిథులుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పాల్గొంటారని తెలిపారు.

బట్టి విక్రమార్కను కలిసిన భాస్కర్‌రెడ్డి



దిల్‌సుఖ్‌నగర్: సీఎల్పీ నేత మల్లు బట్టి విక్రమార్క చేపట్టినా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర నల్గొండ జిల్లా దేవరకొండకు చేరుకొని 1000 కిలో మీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆయనను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి కలిసి కేకు కట్ చేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందీ కవి విజయకుమార్‌కు గౌరవ డాక్టరేట్



వనస్థలిపురం: తెలంగాణకు చెందిన హిందీ కవి, వనస్థలిపురం నివాసి గుండాల విజయకుమార్‌కు మౌంట్ ఎల్బ్రస్ సెంట్రల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తెలంగాణ ప్రాంతంలో హిందీ భాష వ్యాప్తి విజయకుమార్ చేసిన కృషిని గుర్తించి యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది.

ఆర్థికసాయం అందజేత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి బాలాపూర్ మండల కేంద్రంలోని 15వ డివిజన్‌కు చెందిన అర్జున్ ఇటీవల మరణించారు. అతడి కుటుంబ సభ్యులను బాబు జగ్జీవన్‌రాం యూత్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం పరామర్శించారు. రూ.30వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రాజు, గిరీష్, శ్రీరాములు, నర్సింగరావు, వీరుడు, నాగేష్, కిన్నెర, ప్రవీణ్, జంగయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోండి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని ఎస్‌బీఐ రోడ్లపై చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ఆదివారం కొత్తపేట డివిజన్ ఎస్‌బీఐ కాలనీలో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, రోడ్లపై వ్యర్థాలు వేస్తున్నారని, ఈ విషయంపైనా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. స్పందించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్లపై చెత్తలేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ కాలనీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్ కుమార్

పౌరసేవలకు వార్డు ఆఫీసు సిద్ధం

- స్థానికంగానే అందుబాటులో అన్ని విభాగాల అధికారులు
- ప్రజల సమస్యలు ఇక సత్వర పరిష్కారం

చంపాపేట: డివిజన్‌లోని మౌలిక సమస్యల సత్వర పరిష్కారం, స్థానికంగానే అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు సుపరిపాలన అందించే లక్ష్యంతో జీహెచ్ఎంసీ ప్రతీ డివిజన్ కేంద్రంలో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసి పౌరసేవలకు సిద్ధం చేస్తోంది.

- ఇప్పటి వరకు కాలనీల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయా కాలనీల ప్రజలు ఎంతో సమయం, డబ్బులు వెచ్చించి తమకు ఎంతో దూరంగా ఉండే సర్కిల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది.
- తీరా సర్కిల్ ఆఫీసుకు వెళ్తే సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నిరుత్సాహంతో వెనక్కి తిరిగి రావాల్సి వచ్చేది.
- ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ప్రతీ డివిజన్‌కు ఓ వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అన్ని విభాగాల అధికారులు డివిజన్‌వాసులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నందుకు డివిజన్ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పౌరసేవలకు సిద్ధమైన చంపాపేట వార్డు కార్యాలయం

- చంపాపేట మూడుగుళ్ల ఆవరణలోని జీహెచ్ఎంసీ పాత భవనాన్నే డివిజన్ వార్డు కార్యాలయంగా సిద్ధం చేస్తున్నారు.

వార్డు కార్యాలయంలో పౌర సేవలివే..

- వార్డు కార్యాలయ సిబ్బంది విధులను వార్డు అడ్మినిస్ట్రేటివ్ అధికారి (అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్) పర్యవేక్షిస్తారు.
- జీహెచ్ఎంసీలోని ఆయా విభాగాల ఫిర్యాదులను సిబ్బంది స్వీకరించి ముట్టినట్టు రసీదు ఇస్తారు. అనంతరం ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు చేరవేస్తారు
- వార్డు కార్యాలయంలో సర్కిల్ ఏఈ, టౌన్ ప్లానర్, ఎంటమాలజీ, శానిటరీ, బయోడైవర్సిటీ సూపర్‌వైజర్, వీధిదీపాల ఏఈ, ట్రాన్స్‌కో లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, జలమండలి, వార్డు అసిస్టెంట్ వంటి సిబ్బంది కాలనీ వాసులకు అందుబాటులో ఉంటారు.
- ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఫిర్యాదు చేసిన కాలనీవాసులు సంబంధిత అధికారిని నేరుగా వార్డు కార్యాలయంలో కలిసేందుకు అవకాశం ఉంటుంది.

వార్డు ఆఫీస్ ఏర్పాటు హర్షణీయం



ప్రజల వద్దకే పాలన లక్ష్యంతో జీహెచ్ఎంసీ ప్రతిష్టాత్మకంగా డివిజన్ పరిధిలో వార్డు కార్యాలయం ఏర్పాటు చేసి అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని నిత్యం కాలనీవాసులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించడం హర్షణీయం. కాలనీకి సంబధించిన ఏ చిన్న సమస్య అయినా గతంలో పలుమార్లు సర్కిల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేవాళ్లం. సమస్య సత్వర పరిష్కారం కాక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ ఇక్కట్లు తీరుతాయనే భావిస్తున్నాం. కార్యాలయం ఏర్పాటుతో సరిపోదు అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండి చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– యూబీ ఆనందనాయుడు, చంపాపేట

సీనియర్ సిటిజన్స్ భవన ప్రారంభోత్సవాన్ని నిలిపివేయండి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన అఖిలపక్షం నాయకులు

ఎమ్మెల్యేకు అఖిలపక్ష నాయకుల వినతి

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో సోమవారం నిర్వహించ తలపెట్టిన సీనియర్ సిటిజన్స్ భవన ప్రారంభోత్సవాన్ని నిలిపివేయాలని హయత్‌నగర్‌కు చెందిన స్థానికులు, అఖిలపక్ష నాయకులు ఆదివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి కోరారు. కొందరు స్వార్థం కోసం స్థానికేతరులను సభ్యులుగా, కార్యవర్గ సభ్యులుగా చేర్చుకుని భవనం పేరును మార్చారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. భవన శంకుస్థాపన సమయంలో శిలాఫలకంపై సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ భవనం రాశారని, ఇప్పుడు ప్రారంభోత్సవానికి మాత్రం విశ్రాంత ఉద్యోగుల భవనం అని శిలాఫలకంపై రాయించారని వారు చెప్పారు. పేరు మార్పు ద్వారా భవనంలోకి స్థానిక సీనియర్ సిటిజన్లకు ప్రవేశం లేకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కళ్లెం రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి పలువురు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గోవును జాతీయప్రాణిగా ప్రకటించాలి

సైదాబాద్: సకల దేవతా స్వరూపమైన గోవును ప్రభుత్వాలు జాతీయప్రాణిగా ప్రకటించాలని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టులో హైదరాబాద్ నుంచి అరుణాచలం వరకు నిర్వహించనున్న గో మహా పాదయాత్రకు గౌరవ అతిథులుగా హాజరు కావాలని దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయ చైర్మన్ గుండా మల్లయ్యకు ఆయన ఆహ్వానం అందజేశారు. అదే విధంగా వాసవి ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు అయితా రాములు, చింతపల్లి సాయిబాబా ఆలయ చైర్మన్ మంచికంటి ధనుంజయ, మహాకాళేశ్వర ఆలయ చైర్మన్ గాజుల అంజయ్య, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రవీందర్‌గుప్తాలకు ఆయన ఆహ్వానాలు అందజేశారు. కార్యక్రమంలో లోకేష్ యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, మల్లేష్, నాగేశ్వరరావు, రాఘవేందర్ పాల్గొన్నారు.



గుండా మల్లయ్యకు ఆహ్వానపత్రం అందజేసిన బాలకృష్ణ గురుస్వామి

సంక్షేమ పథకాల ప్రదాత కేసీఆర్: నల్లా



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగు, భరోసా కల్పించే సంక్షేమ ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అని చంపాపేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లా రఘుమారెడ్డి అన్నారు. వికలాంగుల పింఛన్ నెలకు రూ. 3016 నుంచి రూ. 4016 కు పెంచిన నేపథ్యంలో ఆదివారం చంపాపేటలోని ప్రభుత్వ వికలాంగుల హాస్టల్‌లో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర బీసీ జేఏసీ నాయకుడు ఓరుగంటి వెంకటేశంగౌడ్‌తో కలిసి ఆయన కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌ముదిరాజ్, అనసూయ, నిశికాంత్‌రెడ్డి, మల్లేష్, చందు, గౌతమ్‌రెడ్డి, భానుప్రకాష్, జగదీష్‌గౌడ్, ప్రభాకర్, శ్రీధర్, హాస్టల్ విద్యార్థులు కృష్ణ, భాస్కర్‌గౌడ్, గుండె నాయక్, వెంకటేష్, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

'సుధీర్‌రెడ్డికి మద్దతు పలుకుదాం'



లక్ష్మీ భవానీనగర్‌లో మహిళల నుద్దేశించి మాట్లాడుతున్న కమలా సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మద్దతు పలికి కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సతీమణి దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన్సూరాబాద్ హయత్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్, పవనగిరికాలనీ, లక్ష్మీ భవానీనగర్‌కాలనీలో ఆదివారం పర్యటించి మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సీఎం కేసీఆర్, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారన్నారు. ఎల్బీనగర్‌ను అభివృద్ధి చేసిన సుధీర్‌రెడ్డిని మరోసారి గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మహిళా నాయకురాళ్లు వసంత, బొల్లేపల్లి ధనలక్ష్మి, శ్యామల, కృష్ణకుమారి, సాయికుమారి, రమ్య, కల్పన, సునీతా రాథోడ్, ఇందిర పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధిలోని శ్రీనివాసానగర్ కాలనీ (విశాలాంధ్రకాలనీ)కమ్యూనిటీహాల్‌లో సుప్రజ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ సతీష్, ఇన్‌చార్జి వినయ్‌కుమార్, కాలనీవాసులు వినోద్‌రెడ్డి, ధామస్‌చౌదరి, జనార్దన్‌రెడ్డి, సరోత్తంరెడ్డి, జైపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్, యాదయ్య పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బాటసింగారం జెడ్పీహెచ్ఎస్ 1985-86 బ్యాచ్ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86వ విద్యాసంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బాటసింగారంలోని పీవీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమావేశమయ్యారు. దాదాపు 37ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఓకేచోటు కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో పాటు కష్టసుఖాలను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అందరూ ఓకే రకమైన దుస్తులను ధరించి సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విష్ణుగౌడ్, శివరాంరెడ్డి, జంగయ్యయాదవ్, ధన్‌రాజ్‌గౌడ్, జగదీశ్వర్, చంద్రశేఖర్, మహేందర్‌గౌడ్, క్రిష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, నరేందర్, క్రిష్ణారెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మేధస్సు పెంపునకు నృత్య, సంగీతాలు దోహదం

సైదాబాద్: భారతీయ కళలైన నృత్య, సంగీతాలు మేధస్సును పెంచడంలో సహకరిస్తాయని లక్ష్మీనగర్ కాలనీ శ్రీవేంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర భక్తసమాజంలో శ్రీగాయత్రి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో కళార్చన పేరిట కళాకారిణులు సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. బెంగళూరు కళాకారిణి నాట్యవిశారద క్షితిజ కాసరవెల్లి సహా పలువురు కళాకారిణులు ప్రదర్శించిన భారతీయ కూచిపూడి శైలి నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కామేశ్వరి, జ్యోతి, రమ్యరెడ్డి, సత్యప్రకాష్ యాదవ్,ఎన్.ప్రసాదరావు, శేషగిరిరావు, వేదుల కనకదుర్గ పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపు

సైదాబాద్: వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందుతుందని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంపాపేటలోని పాఠశాలలో శ్రీత్రివేణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం, పేరెంట్ ఓరియేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులను తీర్చిదిద్దడంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంటుందన్నారు. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు పురస్కారాలు, ఒకటి నుంచి 9వ తరగతికి చెందిన 75 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సైంటిస్ట్ రామకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బార్ల సునీత, పాఠశాల చైర్మన్ జిట్టా సురేందర్‌రెడ్డి, సునీల్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ శారద, యోగీశ్వరి పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి ఎన్ఆర్ఐ విరాళం

దిల్‌సుఖ్‌నగర్: అమెరికాలో ఉంటున్న ప్రవాస భారతీయుడు, సరూర్‌నగర్ ఎస్వీ కాలనీకి చెందిన రజనీకాంత్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి రూ.25 వేలు విరాళం అందజేశారు. ఆన్‌లైన్ ద్వారా ఈ మొత్తాన్ని పంపించారు. ఈ డబ్బుతో విద్యార్థులకు అవసరమయ్యే స్కూల్ యూనిఫాం, బ్యాగ్స్, స్టేషనరీ కొనుగోలు చేయాలని గృహం నిర్వాహకులను కోరారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌కు గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

మీర్‌పేట: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో 5,592 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 3,389 మంది పరీక్ష రాశారని, 2203 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశామని సీఐ పేర్కొన్నారు.



పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐ కిరణ్‌కుమార్

కార్మిక సంక్షేమ సంఘం మహాసభ కరపత్రం విడుదల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్మిక సంఘం నాయకులు

నాగోలు: కొత్తపేట బాబూ జగ్జీవన్‌రాం భవన్‌లో ఈ నెల 20న జరిగే రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం 10వ వార్షిక మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాల్వా చారి పిలుపునిచ్చారు. ఆదివారం నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్తా క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే వార్షిక మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్మిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, ప్రశాంత్, పాషా ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

సులభంగా డబ్బు సంపాదించాలని చోరీల బాట

- ఇద్దరు స్నేహితులను అరెస్టు చేసిన పోలీసులు
- నిందితుల్లో ఒకరు విద్యార్థి, మరొకరు ప్రైవేట్ ఉద్యోగి

హస్తినాపురం: సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురుద్దేశంతో యువకులు చోరీల బాటపట్టి తమ భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని వనస్థలిపురం డివిజన్ ఏసీపీ కె.పురుషోత్తం రెడ్డి అన్నారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం వనస్థలిపురం ఠాణాలో ఏసీపీ కె.పురుషోత్తం రెడ్డి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం...ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కొండపేట గ్రామానికి చెందిన మద్దినేని పవన్‌కుమార్(20) ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతూ మెన్స్ హాస్టల్ ఉంటున్నాడు. కృష్ణాజిల్లా ముప్పల్ల గ్రామానికి చెందిన పెదవల్లి వరుణ్‌కుమార్ (22) ఎల్‌బీనగర్‌లో ప్రైవేట్ మోటార్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పక్క పక్క గ్రామాలకు చెందిన వీరిద్దరూ స్నేహితులు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించేందుకు ఒంటరిగా రాత్రి వేళల్లో నడుచుకుంటూ వెళ్లే మహిళల మెడలోని బంగారు గొలుసులు చోరీ చేయాలని పథకం వేసుకున్నారు. ఇందులో భాగంగానే ఈనెల 7వ రాత్రి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీకి బైక్‌పై వచ్చారు. కాలనీలోని పవన్ క్లాత్‌స్టోర్‌లో విధులు ముంగించుకొని ఇంటికి వెళ్తున్న అనిశెట్టి సీతామహాలక్ష్మి(42) మెడలోని 8 గ్రాముల బంగారు పుస్తెల తాడు తెంచుకొని పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 24 గంటలలోపే నిందితులను పట్టుకున్నారు. ఆదివారం పనామాచౌరస్తా దగ్గర బైకుపై అనుమానాస్పదంగా వెళ్తున్న పవన్‌కుమార్, వరుణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు తామే గొలుసు చోరీ చేశామని అంగీకరించారు. వారి వద్ద నుంచి యమహాబైక్, 8 గ్రాముల బంగారు పుస్తెల తాడు, రెండు సెల్‌ఫోన్లు, మొత్తం దాదాపు రూ.2 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. సమావేశంలో సీఐ జలేంధర్‌రెడ్డి, డీఐ వెంకట్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, స్వామి, క్రైం సిబ్బంది పాల్గొన్నారు. కేసును ఛేదించిన సీఐ జలేంధర్‌రెడ్డి, డీఐ వెంకట్, ఎస్ఐవెంకటేశ్వర్లు, సిబ్బందిని నగదు పురస్కారంతో ఏసీపీ సత్కరించారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

తల్లిదండ్రులు గమనిస్తుండాలి: గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి చదువుకునేందుకు వచ్చిన యువకులు నగరంలో ఏం చేస్తున్నారు, ఎక్కడ ఉంటున్నారు అనేది ఎప్పటికప్పుడు తల్లిదండులు తెలుసుకోవాలని ఏసీపీ సూచించారు. అప్పుడే వారు ప్రయోజకులు అవుతారని, లేకపోతే పెడదారి పట్టే అవకాశం ఉందని హెచ్చరించారు.

తెలంగాణ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌జామ్‌లు



బీడీరెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయిన వాహనాలు

నియంత్రణకు చర్యలు తీసుకోని పోలీసులు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో బొబ్బిలి దామోదర్‌రెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు నరకం చవిచూస్తున్నారు. ఈ కూడలిలో నలువైపుల నుంచి వాహనాలు జిగ్‌జాగ్‌గా వస్తుండటంతో ప్రతిరోజూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయక పోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు గంటల కొద్దీ సమయం రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక వాహనదారులే పూనుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి ఈ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుళ్లను నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9505507616 9912220363 9912220365